క్లుప్తంగా

శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో ఊయల ఉత్సవం


ఊయల ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

సీటీఆర్ఐ: ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో ఈ నెల 16వ తేదీ వరకూ నిర్వహించే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పవిత్ర రోహిణి ఏకాదశి సందర్భంగా హరినామ సంకీర్తన అనంతరం భక్తి కంకణ బన మహరాజ్ ఉపన్యాసం జరిగాయి. 15వ తేదీ వరకు ప్రతి రోజూ సాయంత్రం ఊయల ఉత్సవం ఉంటుందని ఆశ్రమ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస బ్రహ్మచారి తెలిపారు. బుధవారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకూ ప్రతి రోజు సాయంత్రం భగవతాచార్యుల ఉపన్యాసం, ఈ నెల 9వ తేదీన బలరామ జయంతి సందర్భంగా ఉదయం గోపూజ, 10వ తేదీన భగవద్గీత పోటీలు, 13వ తేదీ సాయంత్రం భరత నాట్య ప్రదర్శన, 14వ తేదీ సాయంత్రం భగవద్గీత పోటీ విజేతలకు బహుమతి ప్రదానం, 16వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవం జరుగుతాయని వివరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నిరంతరం కృషి చేయాలని సంఘ్ విజయవాడ డివిజనల్ సెక్రటరీ ఆమంచి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక లోకో రన్నింగ్ బ్రాంచ్ సంఘ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజమహేంద్రవరం శాఖ సెక్రటరీగా సీహెచ్ మల్లికార్జునరావు, ట్రెజరర్‌గా ఎంఎల్ చార్యులు, చైర్మన్‌గా జువ్వల సత్యప్రకాష్, మిగిలిన సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీలు కె.రాజబాబు, డేగల శ్రీను, టికెట్ చెకింగ్ స్టాఫ్ బ్రాంచ్ సెక్రటరీ బాలాజీ, పూర్వపు ట్రెజరర్ బీవీ రమణ, చైర్మన్ డి.రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు గణితంపై ఆసక్తి పెంచాలి

కంబాలచెరువు: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు గణితంపై భయాన్ని పోగొట్టి, దానిపై ఆసక్తిని పెంచాలని సీఎంహెచ్ క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ పి.దుర్గాప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలల సందర్శనలో భాగంగా మంగళవారం జాంపేటలోని నేషనల్ సీనియర్ బేసిక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఈప్రాంత విద్యార్థులకు నూతనంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల అందుబాటులోకి రావడం హర్షణీయమన్నారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. గణితంలోని కొన్ని ముఖ్య అంశాలను స్వయంగా బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వి.సింహాద్రిరావు, ఉపాధ్యాయులు వరహాగిరి కృష్ణమోహన్, కల్పవల్లి, దుర్గాభవాని, రాధామణి పాల్గొన్నారు.

'భాష, సాహిత్యం'పై ఉపన్యాసం

కంబాలచెరువు: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో కళాశాలలోని ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ అకాడమీలో మంగళవారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. మహారాష్ట్రలోని ధూలేలో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ లా ఇంగ్లిష్ ప్రొఫెసర్ డాక్టర్ వైభవ్ సబ్నిస్ 'డిజిటల్ యుగంలో భాష, సాహిత్యం' అనే అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో ఇంగ్లిష్ విభాగం ఇన్‌చార్జి ఎం.శ్రీలక్ష్మి, లెక్చరర్ డాక్టర్ ఎ.రాజేశ్వరి, బీఏ స్పెషల్ ఇంగ్లిష్, బీఏ ఫిలాసఫీ విద్యార్థులు పాల్గొన్నారు.

సమాచారహక్కు చట్టంపై అవగాహన అవసరం


సమాచార హక్కు చట్టంపై ర్యాలీ చేస్తున్న తాతారావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రైతుసాధికారసంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ తాతారావు అన్నారు. కొంతమూరులోని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగ కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తాతారావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజలకు ఉన్న అత్యంత శక్తివంతమైన ఆయుధమన్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంచడానికి ఈ చట్టం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ముందుగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఫ్లైఓవర్రీ..

- అధ్వానంగా ఐఎల్‌టీడీ ఫ్లైఓవర్
- గోడలపై మొలిచిన రావి మొక్కలు
- రోడ్లపై గోతులతో అవస్థలు
- పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు


ఫ్లైఓవర్ రోడ్డుపై ఏర్పడిన గొయ్యి


ఫ్లైఓవర్ గోడలపై పెరిగిన రావి మొక్కలు


రక్షణ గోడల వరకూ పాకిన మొక్కలు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని ఐఎల్‌టీడీ నుంచి బాలాజీపేటకు వెళ్లే ఫ్లైఓవర్ నిర్వహణ అధ్వానంగా మారింది. రోడ్డుపై గుంతలు పడడంతో పాటు ఫ్లైఓవర్ గోడలపై రావి మొక్కలు దర్శనమిస్తున్నాయి. వీటివల్ల వంతెనకు ఎటువంటి సమస్య తలెత్తుందోనని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. గతంలో నగర పరిసర గ్రామాల నుంచి నగరంలోకి వచ్చేటప్పుడు రైల్వేగేటు పడితే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు కృషితో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి పాలనలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మించారు.

అధ్వానంగా నిర్వహణ

రైల్వే ఫ్లైఓవర్ నిర్వహణ ఆర్అండ్‌బీ శాఖ పర్యవేక్షణలో ఉంటుంది. అయితే పరిశుభ్రతను నగర పాలకసంస్థ చూస్తుంది. ప్రస్తుతం గోడలపై రావి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. వాటి వేళ్లు గోడల లోపలకు వెళ్లి, ఎక్కడ బీటలు వారతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై గుంతలు ఉండడంతో రాత్రి సమయంలో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం గోదావరి ఉధృతంగా ఉండడంతో ఇసుక లారీలు తిరగకపోవడం వలన కొంత ప్రమాదం తప్పింది. ఇసుక లారీలు తిరిగే సమయంలో ఫ్లైఓవర్ రోడ్డుపైనే ఇసుక జారిపడేది. దీనివల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇక్కడి వీధిలైట్లు సైతం ఒక్కోసారి వెలగడం లేదు.

మందుబాబులకు అడ్డా

రైల్వే ఫ్లైఓవర్‌కు ఇరువైపులా రెండు మెట్లమార్గాలు ఉన్నాయి. ఇవి ప్రస్తుతం మందుబాబులకు అడ్డాగా మారాయి. రాత్రి సమయాల్లో మందుబాబులు ఈ మెట్లపై కూర్చుని జాలీగా మందు కొడుతుంటారు. పోలీసులు గస్తీ తిరుగుతున్నప్పటికీ వారికి భయం లేకుండా పోతోంది.

రావి మొక్కలు తొలగించాలి

> రైల్వే ఫ్లైఓవర్ గోడలపై రావి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. దీనివల్ల ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్లపై గుంతలను పూడ్చడంతో పాటు వీధిలైట్లు పూర్తిస్థాయిలో వెలిగేలా చర్యలు చేపట్టాలి.
>
> – చీకురిమిల్లి చిన్న, 17వ డివిజన్, రాజమహేంద్రవరం

'విద్యార్థి వికాసం' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈవో వాసుదేవరావు

కంబాలచెరువు: గాడాల మండల ప్రజా పరిషత్ మోడల్ ప్రైమరీ నెంబర్ వన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.సురేష్ కుమార్ రచించిన విద్యార్థి వికాసం అనే పుస్తకాన్ని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. విద్యార్థి బాల్య దశ నుంచి కౌమారం వరకు వారి ఆలోచనలు ఏ విధంగా ఉంటాయో అనేక ఉదాహరణలతో రచించిన సురేష్ కుమార్‌ను ఆయన అభినందించారు. విద్యార్థులపై, వారి భవిష్యత్తుపై ఉపాధ్యాయులు పాజిటివ్ దృక్పథంతో ఉండాలన్నారు. పుస్తకం ఎడిటర్‌గా ఉన్న డాక్టర్ ఎం.గోపాలకృష్ణ మాట్లాడుతూ సురేష్ కుమార్ అనుభవాలు, సమాజ పరిస్థితులు, విద్యార్థులు తల్లిదండ్రుల స్థితిగతులను చాలా చక్కగా రాశారన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఏడీలు వెంకట్ రాజు, ఛాయాదేవి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో లోపం ఉండరాదు


క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న ఏడీసీ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని సిబ్బందికి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ఆదేశించారు. ఐవీఆర్ఎస్ సర్వేలో 17వ వార్డు సచివాలయ పరిధిలో పలు ఫిర్యాదులు అందడంతో మంగళవారం ఆయన ఆల్‌బ్యాంకు కాలనీ, వెంకటేశ్వర నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణలో పారిశుధ్య కార్మికులదే కీలకపాత్ర అన్నారు. రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, ముఖ్యంగా డివైడర్ల వద్ద పేరుకుపోయిన మట్టిని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. రహదారులపై నీరు నిల్వ ఉండకుండా, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు లేకుండా చూడాలని, అప్పుడే దోమలు పెరగకుండా ఉంటాయన్నారు. స్థానిక పార్కుల వద్ద ఎవ్వరూ చెత్త పడవేయకుండా డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ప్రజలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ, ఫిర్యాదులు రాకుండా పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. అనంతరం స్థానికులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమన్నారు. మన ఇళ్లను ఎంత శుభ్రంగా ఉంచుతామో పరిసర ప్రాంతాలను కూడా అలాగే ఉంచాలన్నారు. ఆయన వెంట పబ్లిక్ హెల్త్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం


కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నగర పరిధిలో అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్)ను జీవో 134 ద్వారా అవకాశం కల్పించిందని కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి అన్నారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ అనధికార లేఅవుట్లలో 2025 జూన్ 30 కన్నా ముందు కొనుగోలు చేసిన ప్లాట్లకు ఈ అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. దీని ద్వారా ప్రజలకు సులభతరంగా స్వీయ ధ్రువీకరణ అంగీకార పత్రం సమర్పించి భవన నిర్మాణ అనుమతులు పొందుటకు వెసులుబాటు కల్పించడం జరిగిందన్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలు ఈ ఎల్ఆర్ఎస్ స్కీంను సద్వినియోగం చేసుకుని తమ అనధికార ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. అనధికార స్థలాలు, ప్లాట్లను కొనుగోలు చేసిన యజమానులు ప్రభుత్వ వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్రమబద్ధీకరణ చేయని అనధికార లేఅవుట్ల ప్లాట్లకు రిజిస్ట్రేషన్ నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ఈ తరహా ప్లాట్లకు బ్యాంకులు రుణాలు కూడా ఇవ్వవని, అలాగే ముఖ్యమైన మౌలిక సదుపాయాలు కూడా మంజూరయ్యే అవకాశం ఉండదన్నారు. పూర్తి వివరాల కోసం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం, వార్డు సచివాలయాల్లోని ప్లానింగ్ సెక్రటరీలను సంప్రదించాలన్నారు.

ఆర్టీసీ స్థలాల ధారాదత్తం దారుణం


ధర్నా నిర్వహిస్తున్న ఆర్టీసీ యూనియన్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: జీవోఎంఎస్ నంబర్ 137తో రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ స్థలాలను అడ్డగోలుగా ప్రైవేటు వారికి ధారాదత్తం చేయడం దారుణమని ఏపీఎస్ఆర్టీసీ యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ బీఆర్‌కే కుమారి ధ్వజమెత్తారు. మంగళవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో గేట్ వద్ద ఈ జీవోకు వ్యతిరేకంగా యూనియన్ కార్మికులు పెద్దఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తక్షణమే ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోకపోతే దశలవారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వ తీరును ప్రజలు, కార్మికులు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. విజయవాడ నడిబొడ్డులో ఉన్న పాత బస్టాండ్ స్థలాన్ని, గవర్నర్‌పేట–2 డిపో స్థలాన్ని గంపగుత్తగా లులు మాల్ అనే విదేశీ కంపెనీకి కట్టబెట్టడం దారుణమన్నారు. అత్యంత అనువుగా ఉన్న ఆర్టీసీ సేవలను సిటీకి దూరంగా ఉన్న రాళ్లకుంట అనే ప్రాంతానికి తరలించడం ప్రజా వ్యతిరేక విధానమేనన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు నారాయణ, కేవీఎస్ నారాయణ, రేష్మ, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్


స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

193 వాహనాల సీజ్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లావ్యాప్తంగా కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా పోలీసు కార్యాలయం మంగళవారం వెల్లడించింది. ఇందులో భాగంగా రికార్డులు, రిజిస్ట్రేషన్ నంబర్లు లేని 193 ద్విచక్ర వాహనాలతో పాటు, ఐదు లీటర్ల సారా సీజ్ చేసినట్టు పేర్కొంది. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో జోనల్ డీఎస్పీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో పోలీసు, స్పెషల్ పార్టీ సిబ్బంది బృందాలుగా ఏర్పడి, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రతిరోజు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించినట్టు ఎస్పీ డి.నరసింహకిశోర్ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలను గుర్తించిన ప్రాంతాల్లో క్షుణ్ణంగా సోదాలు చేసినట్టు చెప్పారు. సారా, గంజాయి, మందుగుండు సామగ్రి, మద్యం అక్రమ నిల్వలపై దృష్టి సారించామన్నారు. అనుమానితులను ఆరా తీశామన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులను ఉపేక్షించబోమని, అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పింఛన్లు, ఉపకార వేతనాల పంపిణీ


వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న సంఘ సభ్యులు

సీటీఆర్ఐ: వాకర్స్ యోగా, లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో వీటీ డిగ్రీ కళాశాల ఆనందా గార్డెన్స్‌లో మంగళవారం వృద్ధులకు పింఛన్లు, విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మీ నరసింహ బ్లాక్ స్మిత్ వర్క్స్ అధినేత బత్తిన రామ్ ప్రసాద్ మోహనరావు మాట్లాడుతూ 14 ఏళ్లుగా పింఛన్లు, ఉపకార వేతనాలు అందించడం హర్షణీయమన్నారు. ఈ సంస్థ ఇటువంటి ఎన్నో మంచి కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. కెనడాలో నివాసం ఉంటున్న డాక్టర్ సంధ్య చీపురుపల్లి మిత్రబృందం కలిసి మార్టిన్ తమిళ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా నిర్వహించిన సమ్మర్ పిక్నిక్ క్యాంపులో వసూలైన రూ.30 వేలను క్లబ్ ద్వారా ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రతిభ కలిగిన ముగ్గురు బీటెక్ చదువుతున్న విద్యార్థులకు ఉపకార వేతనంగా అందజేశారు. 80 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున మొత్తం రూ.40 వేలను క్లబ్ తరఫున పింఛన్ల రూపంలో పంపిణీ చేశారు. కొత్త రాజ్య విజయలక్ష్మి విద్యానిధికి విరాళంగా క్లబ్‌కు రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు పామర్తి గోపాలరావు, సెక్రటరీ గుబ్బల గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో వంద ఎకరాలు కేటాయించాలి


ఏడీసీ చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప తదితరులు

కడియం: అమరావతిలో కడియం నర్సరీ అసోసియేషన్‌కు 100 ఎకరాలు కేటాయించాలని అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారథి భాస్కర్‌ను సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలోని ఏడీసీ కార్యాలయంలో ఆమెకు నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అయ్యప్ప మాట్లాడుతూ నర్సరీ అసోసియేషన్‌కు 100 ఎకరాలు కేటాయించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయంగా ఎంతో ప్రసిద్ధి చెందిన కడియం నర్సరీలు, అమరావతి రాజధాని మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. అమరావతిలో ప్లాంట్ బయో డైవర్సిటీ, హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్, హార్టికల్చర్, ఫ్లోరికల్చర్ మార్కెట్ ఏర్పాటు చేయాలన్నారు.

గణిత మేధావి హెన్రిక్‌కు నివాళి


నీల్స్ హెన్రిక్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే

కంబాలచెరువు: ప్రపంచ గణిత మేధావి నీల్స్‌హెన్రిక్ ఏబుల్స్ జయంతిని మంగళవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో గణిత శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పరిసర ప్రాంతాల్లోని ఐదు మున్సిపల్ స్కూళ్లకు చెందిన 120 మంది విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ టెక్నో స్పియర్‌లో ఏఐ సహాయంతో 25 మార్కులకు గణితంలో ఆన్‌లైన్ టాలెంట్ హంట్ పరీక్ష జరిపారు. దీనిలో విజేతలుగా నిలిచిన ఆరుగురికి ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున నగదు బహుమతిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బేసిక్ సైన్స్‌పై ఆసక్తి పెంచుకుని, ఉత్తమ పరిశోధనలతో ఉజ్వల భవిష్యత్తు పొందాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ డీవీఎస్ మూర్తి మాట్లాడుతూ మ్యాథమెటిక్స్‌లో గమ్మత్తైన ప్రశ్నలతో విద్యార్థులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో గణిత విభాగాధిపతి జి.చంద్రశేఖర్, కంప్యూటర్ విభాగాధిపతి డాక్టర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


కడియం మండల పరిషత్ కార్యాలయంలో టీ తాగుతూ మాట్లాడుకుంటున్న ఉద్యోగులు


ధవళేశ్వరం ఇరిగేషన్ కార్యాలయంలో..

కడియం: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 'రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా కార్యదర్శి సీహెచ్ఎస్ విల్సన్ పాల్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కడియం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. విల్సన్ పాల్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం మూడు నెలల పాటు జరుగుతుందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన రూ.30 వేల కోట్ల బకాయిల చెల్లింపు, డీఏ, ఐఆర్, పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు వంటి ఉమ్మడి సమస్యలతో పాటు, అన్ని శాఖల ఉద్యోగులకు అనేక రకాల సమస్యలున్నాయన్నారు. ఉద్యోగులతో వారి కార్యాలయంలోనే సమావేశమై టీ తాగుతూ సమస్యలను చర్చించి, పరిష్కార మార్గాలను తెలుసుకుని, ప్రభుత్వానికి నివేదించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి పీవీ సుబ్బారావు, జిల్లా నాయకులు జె.రాజారావు, కె.శ్రీనివాసరెడ్డి, టి.మణిశ్రీ రాజమండ్రి రూరల్ తాలూకా నాయకులు ఎస్‌వీఎస్ రాజు, పి.మురళీకృష్ణ తదితరులు మాట్లాడారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: గ్రామంలోని ఇరిగేషన్ కార్యాలయంలో 'రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ఎస్ విల్సన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపకపోతే ఉద్యమం


జాంపేట సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రకాశం నగర్: వినియోగదారులకు స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపకపోతే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ హెచ్చరించారు. స్మార్ట్ మీటర్ల బిగింపు, విద్యుత్ సర్దుబాటు చార్జీలు, విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ మంగళవారం జాంపేట సబ్ స్టేషన్ ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారం మోపాలని చూస్తోందని ఆరోపించారు. స్మార్ట్ మీటర్లు బిగించేందుకు వస్తే ప్రజలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి టి.మధు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ బకాయిలను ఇప్పుడు సర్దుబాటు చార్జీలతో వినియోగదారులపై భారం వేయడం సరికాదన్నారు. తక్షణమే స్మార్ట్ మీటర్ల విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.పవన్, పూర్ణిమ రాజు, ఎస్ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

రంగంపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి అన్నారు. ఈ నెల తొమ్మిది నుంచి 11వ తేదీ వరకు బాపట్లలో రాష్ట్రస్థాయిలో జరిగే సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలకు ఆ పాఠశాల విద్యార్థులు కారి నాగభవ్య, దంగేటి కీర్తన, కరాటం జాహ్నవి సాయి వీరలక్ష్మి, కోడూరి యవనలక్ష్మి, సంగిరెడ్డి లక్ష్మణసాయి, కొనె వీర వెంకట సత్యనారాయణ ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ విద్యార్థులను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో రంగంపేట హైస్కూల్ సత్తాను చాటాలని, పీడీ శైల ఇచ్చే సూచనలను చిత్తశుద్ధితో ఆచరించి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులను పంపుతూ, మంచి శిక్షణ ఇస్తున్న పీడీ శైలను ప్రశంసించారు.

విద్యా హక్కు చట్టం ప్రకారం అడ్మిషన్లు ఇవ్వండి

రాజమహేంద్రవరం రూరల్: విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలల్లో ఒకటో తరగతి విద్యార్థులకు కేటాయించిన సీట్లలో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి కంది వాసుదేవరావు అన్నారు. స్థానిక ఫ్యూచర్ కిడ్స్ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో రాజమహేంద్రవరం డివిజన్‌లోని 10 మండలాల ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులతో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మూడు నుంచి ఐదు కిలోమీటర్ల లోపు నివసించే పిల్లలు కూడా ఒకటో తరగతిలో ఉచిత సీట్లలో చేరవచ్చని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆ ప్రకారం అడ్మిషన్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. లీప్ యాప్‌లో విద్యార్థుల హాజరును ఉదయం 9:30 లోపు పూర్తి చేయాలన్నారు. యూడైస్ ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న అపార్ ఐడీ జనరేషన్ త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో రాజమహేంద్రవరం అర్బన్ డీఐ బి.దిలీప్ కుమార్, రూరల్ ఎంఈఓ ఎ.దుర్గా తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	:	సార్ మేడమ్
సూర్యమినీ	:	మహావతార్ నరసింహ,
సూర్యప్యాలెస్	:	కింగ్‌డమ్
స్వామి	:	హరిహర వీరమల్లు
అనుశ్రీ	:	హరిహర వీరమల్లు
శివజ్యోతి	:	సార్ మేడమ్
రాజా	:	కింగ్‌డమ్
ఊర్వశి	:	మహావతార్ నరసింహ
మేనక	:	సన్ ఆఫ్ సర్దార్–2
రంభ	:	జూనియర్
అప్సర	:	కింగ్‌డమ్
అశోక	:	కింగ్‌డమ్
నామవరం		
వీఎస్ మహల్	:	కింగ్‌డమ్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	కింగ్‌డమ్
కడియం		
వెంకటసూర్య	:	కింగ్‌డమ్